

# మినీకథావీధి

## సలహా



పాలకూర సీతాలత

అగ్నిహోత్రావధాన్లు నిప్పులాంటి వంశంలో పుటాడు.

నిత్యాగ్నిహోత్రుడు. రోజుకు ఓ డజను పెట్టెల సిగరెట్లు తాగుతాడు. భార్యలేకుండా బ్రతకగలడుగానీ అవి లేకుండా బ్రతకలేడు. సిగరెట్లు తాగడంవల్ల భయంకర వ్యాధులు వస్తాయని పుస్తకాల్లో చదివిన నాటినుంచీ, పుస్తకాలు చదవడం పూర్తిగా మానేశాడు. సిగరెట్లు తాగడం ఆరోగ్యానికి హానికరం అన్న చట్టబద్ధమైన హెచ్చరికను సిగరెట్ పెట్టెలమీద చూసినపుడు ప్రభుత్వం బలవంతంవల్ల అబద్ధాల ప్రచారం చెయ్యవల్సివస్తోందే అని బాధపడతాడు.

అతని కొడుకే ధూమేశ్వర్రావు. తండ్రి కడుపున చెడపుట్టలేదు. తండ్రి అడుగు జాడలలోనే నడుస్తూన్నాడు. తండ్రిలా కాకపోయినా రోజుకోపెట్టె సిగరెట్లు తగలేస్తాడు. ఆ విషయం అగ్నిహోత్రావధాన్లుకి తెలియదు. తన కాళ్ళమీద నిలబడి ఉద్యోగం చేసుకుంటూ తన డబ్బులే ఖర్చు పెట్టుకుంటున్నందున తండ్రికి తెలిసినా ఏమీ అనడు అన్న నమ్మకం ధూమేశ్వర్రావుది.

ఓ రోజు ధూమేశ్వర్రావు భోజనం చేస్తుండగా అతని తండ్రికి చిల్లరడబ్బులు అవసరం వచ్చి అతన్ని అడిగాడు. "ఫాంటు జేబులో వున్నాయి తీసుకో"మని తండ్రికి చెప్పాడు. చిల్లర డబ్బులు తీస్తుండగా అందులోని సిగరెట్ పెట్టె కన్పించింది అగ్నిహోత్రావధాన్లుకి.

ఆ రోజు రాత్రి కొడుకుని పిలిచాడు.

"సిగరెట్లు ఎన్నాళ్ళనుంచి తాగుతున్నావ్?" అడిగాడు తండ్రి.

"రెండు" అన్నాడు కొడుకు.

"నెలలా?"

"కాదు, సంవత్సరాలు."

"కానీ నాకు ఈ రోజే తెల్సింది."

మాట్లాడలేదు కొడుకు.

తండ్రి ఇలా అన్నాడు.

"చూడు, నేను నిన్నేదో తిట్టిపోస్తానని అనుకోకు. సిగరెట్లు మానడం ఎంత కష్టమో నాకూ తెల్సు. మొదటిసారి నేను దొరికిపోయినప్పుడు మా నాన్న నాకు మానమని సలహా ఇచ్చాడు. అది ఆచరణలో పెట్టడం కష్టం అయింది. అందుకని అదే సలహా నీకు ఇవ్వను. నీ డబ్బుల్తో నువ్వు కొనుక్కుంటున్నప్పుడు నాదేం పోయింది? కానీ నా సలహా మరోటి. నువ్వు నా బ్రాండ్ "విల్స్" సిగరెట్లు మాత్రం అలవాటు చేసుకోకు. ఎందుకంటే అవి నేను యిద్దరికీ కొన్లేను. వేరే బ్రాండువాడు."

తల వూపాడు పుత్రరత్నం.

---

## ఫీలర్



చందు సుబ్బారావు

బ్రహ్మం కంట్రాక్టులు చేసే రోజుల్లో వచ్చిన తాశీల్దారునల్లా మేపటం అలవాటయిపోయింది.

ఇందులో కొందరు తాశీల్దార్లు ఆనెస్ట తిక్కేశ్వరరావు లుండేవాళ్ళు. వాళ్ళకు లంచమియ్యబోతే, విసిరి ముఖాన కొట్టమే కాకుండా డిప్టీ తాశీల్దారుని పిల్చి "ఈయన పేరు నోట్ చేసుకో! ఇకముందు ఇతనికి కెంటర్లేవీ ఇవ్వటానికి వీల్లేదు. ఆఫీసు ఆవరణలో ఎక్కడ కనపడినా దావబాది చెవులు ముయ్యండి" అని చెప్పేయగలరు.

ఇలాంటి తిక్కపిచ్చయ్యల బారి పడకుండా ఉండేందుకు బ్రహ్మం ఓ నికార్సయిన ఫూల్ ప్రూఫ్ పద్ధతి కనిపెట్టాడు. దాన్నే 'ఫీలర్' వదులుట లేక గాలంవేయు పద్ధతి అంటారు.

క్రొత్తతాశీల్దారొచ్చి నాల్రోజులై కాస్త సెటిలయిం తర్వాత బ్రహ్మం ఓఆదివారం రోజున తన గాలం వేస్తాడు.

తన పల్లెటూళ్ళోనే ఓ వెర్రి వెంకయ్యను పిల్చి, మాంచి గడ్డ కట్టిన జున్ను టిఫిన్ కేరేజినిండా పెట్టి, అతగాడికి తాశీల్దార్ ఇంటి అడ్రసూ వివరాలు 'గట్టిగా' చెప్పి నాటకం రిహార్సులు వేయించి పట్నానికి చార్జీలిచ్చి పంపుతాడు.

వెంకయ్య ఫస్టు బస్సందుకుని పదయ్యే

పరికల్లా ఇల్లు వెతుక్కుంటూ తాశీల్దారు ఇంటిముందు నిలుస్తాడు. లోపలికి వెళ్ళొచ్చాలేదా అని దిక్కులు వెతుక్కుంటూ.

బంట్రోతు కనపడి.

"ఎవరు కావాలి?" అనడుగుతాడు.

"అయ్యగారు కావాలి"....వెంకయ్య!

"అయ్యగారు వన్లో వున్నారు. వచ్చిన పనేమిటో చెప్పు...."

"సాయంగా చెప్పమన్నారండి. ఆలిస్సిమయితే ఈ అరుగు మీద కూకుంటా లెండి...."

"ఏ వూరు మన్ది?"

"ఏ వూరైతేనేం లెండి."

"ఓయ్ మా తిక్కగా వుందే. సాయ్యంగా ఆయనే వత్తాడు కూసో"

బంట్రోతు విసుక్కుంటూ లోపలికి....

కాసేపట్లో అయ్యగారు బయటకొస్తారు ముఖం చిట్లించుకుంటూ.

"ఎవరు నీవు?"

"మాది రావులపాలెం బాబూ. బెమ్మేశ్వరరావుగారు తమకిచ్చి రమ్మని జున్ను పంపారు. మీరూమీరూ తర్వాత మాట్టాడుకుందారన్నారండి....'

ఎవడా బెమ్మేశ్వరరావు - ఏమిటా జున్ను....జున్నూ మన్నూను....గెటవుట్ వెధవ కరప్షనూ వీళ్ళూను..విలేజ్ ఏసెస్.. గెటవుట్ .... ఎవడా బెమ్మేశ్వరరావు- చెప్పసలు....'

వెంకయ్య హడిలిపోయినట్టు నటించి బొడ్లోనుంచి ఓ కాగితం ముక్క తీసిస్తాడు....దాన్లో

'వి. పూర్ణచంద్రరావు, అడ్వకేటు, తాశీల్దారుగారి ఇంటి ప్రక్కన.' అని వుంటుంది....

తాశీల్దారుగారు చదివి, ముఖం పనసకాయలాపెట్టి "ఓ....ఐసీ....ఆ ప్రక్కిల్లు-పో-పో" అని తలుపులు వేసుకుంటాడు,

వెధవ న్యూసెన్సన్నట్టు.

వెంకయ్య బ్రతుకు జీవుడాఅని కర్చుగాని "ఎర"తోసహా రావులపాలెం దారి పడతాడు. ★

# ఫేవరెట్



బండారు హేమమాలిని

"ఛీ! నీవన్నీ వెధవ పేస్టులె" అంటూ విసుక్కుంది వీణ ఆశాని.

"అక్కడికి, నీది మహా మంచి టేస్టయినట్టు. నువ్వు చెప్పే వాళ్ళందరికంటే వెయ్యిరెట్లు బాగుంటాడు రాజు" - తన బాయ్ ఫ్రెండుని సమర్థిస్తూ అంది ఆశా.

"సరేలే. ఏదో పొడుగ్గా, తెల్లగా ఊగిపోతున్నట్టుండగానే సరా !! ఎవరైనాసరే, రంగు తక్కువైనా, కళ ఉండాలోయ్ మొహంలో. అలా ఉంటేనే నాకు స్మార్ట్‌గా ఉన్నట్టు అనిపిస్తారు." ఎక్కడో ఆలోచిస్తున్నట్టు అంది వీణ.

"ఓహో.... అయితే అలా ఉండేవాళ్ళనెవరినైనా చూపించు చూద్దాం-" రాజును గురించి తేలికగా మాట్లాడినందుకు కోపం వచ్చినా, స్నేహితురాలిని ఏమీ అనలేక కోపాన్ని అణుచుకుంటూ అడిగింది ఆశా.

"ఎవరో, ఎందుకూ.... నా ఫేవరెట్ నే చూపిస్తాను. అహఁ అలా కాదు. నువ్వేకనుక్కోవాలి. అతన్ని చూశాక, నువ్వే ఒప్పుకుంటావ్, ఈ వీణా చెప్పింది కరెక్టని. అతను మనకు రోజూ సరిగ్గా దొండపర్తి నుంచి టి. యస్. యన్. కాలనీకి వెళ్ళే దారిలో కనిపిస్తాడు."

"ఏడ్చినట్టుంది. మనము రోజూ కాలేజీకి వెళ్ళే దారిలో మనము మూర్ఛపోవలసినంత, మెచ్చుకో దగినంత వాళ్ళెవరూ నాకింతవరకు కనిపించలేదు అయినా ఈ రోజు చూస్తాను" అంది వీణ మాటల మీద ఏ మాత్రం నమ్మకములేని ఆశా.

"సరే నువ్వు రెండు రోజుల్లో అతన్ని చూడలేకపోతే, మూడో రోజున నేనే చూపిస్తాను" అంది చిరునవ్వుతో వీణ.

"అయితే నాకు ఇంకా కొంచెం వివరాలు కావాలి. అతను నలుపా? తెలుపా?" తన ఇంటర్వ్యూ మొదలుపెట్టింది ఆశా.

"రెండూ కాదు. మధ్యరకంగా ఉంటాడనే చెప్పొచ్చు."

"ఉంగరాల జుట్టా?" అని అడిగి, వీణ ఆలోచనలో పడటం చూసి- "పోనీ బడాజానా, చోటా జానా?" అని అడిగింది.

"బడాజానే అయ్యుండొచ్చు"

"అయ్యుండొచ్చు ఏమిటే, నీ మొహం రోజూ చూస్తూ"- చిరాకు పడిపోయింది ఆశా.

"ఇదిగో అతను పొడుగా, పొట్టా, ఎలా నడుస్తాడు అని నువ్వడిగితే చెప్పడం కష్టం. ఆ తరువాత నీ ఇష్టం. పోనీ, నేనే నీకు ఒక క్లూ చెప్తాను. అతను నేను చూసినప్పుడల్లా సిగరెట్టు వెలిగించుకుంటూనే కనిపిస్తాడు. బహుశా చైన్ స్మోకర్ అయ్యుండొచ్చు. ఏం షోగ్గా వెలిగించుకుంటాడులే" అంది అందంగా కళ్ళు త్రిప్పుతూ వీణ. పైగా సిగరెట్టు ఒకటా అనుకుంటూ వీణ తన్మయత్వం

